క్లుప్తంగా

రికార్డుల కంప్యూటరైజేషన్‌కు సహకరించాలి

కె.గంగవరం: మండలంలోని అముజూరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం(ఏపీసీఎస్)లో రైతులకు సంబంధించిన రికార్డులు కంప్యూటరైజేషన్ చేస్తున్నామని సంఘ పరిధిలో ఉన్న రైతులందరూ సహకరించాలని సొసైటీ సీఈఓ పాలకొల్లు సత్యనారాయణ కోరారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సంఘ పరిధిలో ఉన్న అముజూరు, కూళ్ల, నరజాడ, తమ్మయ్యపాలెం, మల్లవరం, నీలగిరిపేట గ్రామాల్లోని సభ్యులు అందరూ విధిగా తమ రికార్డులను తప్పనిసరిగా కంప్యూటరైజేషన్ చేసుకోవాలన్నారు. సొసైటీలో 15 రోజుల పాటు ఈ ప్రక్రియ కొనసాగుతుందని సభ్యులకు సమాచారం కావాలంటే కార్యాలయ పనివేళల్లో సంప్రదించాలని ఆయన కోరారు.

బాలకార్మికుల గుర్తింపునకు తనిఖీలు


అంగర దుకాణంలో సర్వే చేస్తున్న పలు శాఖల సిబ్బంది

కపిలేశ్వరపురం: బాలకార్మికుల గుర్తింపునకు పలు శాఖల సిబ్బంది మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం తనిఖీలు చేశారు. కార్మిక, పోలీస్, విద్యా శాఖలు, ఐసీడీఎస్, ఎన్జీటీఎస్ అధికారులు అంగర, పడమర ఖండ్రిక గ్రామాల్లోని వ్యాపార దుకాణాలను పరిశీలించారు. 18 ఏళ్ల లోపు చిన్నారులు పనిలో ఉన్నారా? అన్న కోణంలో వాకబు చేశారు. నిబంధనల మేరకు చిన్నారులను పనిలోకి పెట్టుకుంటే చట్ట పరిధిలో చర్యలు తప్పవని వ్యాపార దుకాణాల నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో సీఆర్పీలు, అంగన్‌వాడీలు, పోలీసు, కార్మిక శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం తహసీల్దార్‌గా చిన్నారావు

కపిలేశ్వరపురం: తహసీల్దార్‌గా పైడి చిన్నారావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. రాజమహేంద్రవరం డివిజన్ నుంచి ఆయన బదిలీపై కపిలేశ్వరపురం వచ్చారు. ఈయన గతంలో ఇక్కడ తహసీల్దార్‌గా పని చేశారు. ఇప్పటి వరకూ ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన రాజరాజేశ్వరి పశ్చిమ గోదావరి జిల్లాకు బదిలీ అయ్యారు. రెవెన్యూ సేవలను విస్తృత పరిచేందుకు తన వంతు కృషి చేస్తానని చిన్నారావు తెలిపారు.

జాతీయ పతాక చిత్రం.. దేశభక్తికి చిహ్నం


వాటర్ కలర్స్‌తో రూపొందించిన స్వాతంత్య్ర దినోత్సవ చిత్రం


ఇందుగమిల్లి సాదాగర్

రాయవరం: ఊరూ.. వాడా స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలకు సిద్ధమవుతోంది. ఈ సమయంలో ప్రతి ఒక్కరూ విభిన్న రూపాల్లో దేశ భక్తిని చాటుకునే ప్రయత్నం చేస్తున్నారు. రాయవరం గ్రామానికి చెందిన ఇందుగమిల్లి సొదాగర్ రూపొందించిన చిత్రం పలువురిని ఆకట్టుకుంటోంది. స్వాతంత్య్ర దినోత్సవంపై ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు స్వాతంత్య్ర దినోత్సవ కాన్సెప్ట్‌తో త్యాగధనుల పోరాట ఫలితమే మన స్వతంత్ర భారతమని తెలియజేస్తూ 78వ స్వాతంత్య్ర దినోత్సవ కాన్సెప్ట్‌తో చిత్రాన్ని వాటర్ కలర్స్‌తో రూపొందించారు.

రావి ఆకులపై భారతదేశ చిత్రాలు


రావి ఆకులపై భారతదేశ చిత్రాలను రూపొందించిన హర్ష, ప్రవీణ్‌కుమార్

రామచంద్రపురం రూరల్: మండలంలోని హసన్‌బాద జెడ్పీ హైస్కూల్‌లో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులు కె.హర్ష, వి.ప్రవీణ్‌కుమార్‌లు 78వ స్వాతంత్య్ర దినోత్సవాలను పురస్కరించుకుని రావి ఆకులపై భారతదేశ చిత్రాన్ని రూపొందించారు. వీరిని పాఠశాల ప్రధానోపాధ్యాయిని పీఎస్‌బీఎస్‌కే సుందరి, చిత్రకళా ఉపాధ్యాయుడు జి.శ్రీను అభినందించారు.

గోవిందరాజుకు సత్కారం

రాజోలు: స్థానిక సర్కిల్ ఇన్‌స్పెక్టరు(సీఐ)గా బాధ్యతలు నిర్వహించి బదిలీ అయిన ఆర్.గోవిందరాజును బుధవారం సర్కిల్ పరిధిలోని పోలీస్ సిబ్బంది ఘనంగా సత్కరించారు. తాటిపాకలోని సోమిశెట్టి ల్యాండ్‌మార్క్‌లో జరిగిన సత్కార సభలో సీఐ గోవిందరాజు సేవలను కొనియాడుతూ పలువురు ప్రసంగించారు. రాజోలు, నగరం, మలికిపురం, సఖినేటిపల్లి ఎస్సైలు పాల్గొన్నారు.

స్వాతంత్య్రోద్యమానికి స్ఫూర్తి

- నియోజకవర్గంలో గాంధీజీ నడయాడిన నేల
- ఆయన స్మృతులతో పులకించిన పరిసర ప్రాంతాలు


రామచంద్రపురం పట్టణంలోని గాంధీజీ ఉద్యమకారులతో ప్రసంగించిన టౌన్‌హాల్


రాజమహేంద్రవరంలో ఏర్పాటు చేసిన దువ్వూరి సుబ్బమ్మ విగ్రహం

రామచంద్రపురం రూరల్: అహింసే ఆయుధంగా బ్రిటిష్ ప్రభుత్వాన్ని వణికించిన జాతిపిత మహాత్మాగాంధీ పాదస్పర్శతో రామచంద్రపురం పరిసర ప్రాంతాలు పులకించాయి. ఆ మధుర స్మృతులను ఇప్పటికీ ఈ ప్రాంత ప్రజలు చెప్పుకుంటూ ఆ మహనీయుల త్యాగాన్ని స్మరిస్తుంటారు. స్వాతంత్య్రోద్యమంలో దేశ ప్రజలను భాగస్వామ్యం చేసేందుకు చేపట్టిన దేశ యాత్రలో భాగంగా రామచంద్రపురం పట్టణంలో శెట్టిగారిల్లు, రూరల్ మండలంలోని చోడవరంలోని బిక్కిన వెంకటరత్నం నివాసం మహాత్మాగాంధీ సందర్శించారు.

శెట్టి గారింట్లో సమావేశం

పట్టణంలోని ప్రధాన రహదారిలో సిండికేట్ బ్యాంకు పక్కనే ప్రస్తుతం శెట్టిగారిల్లుగా పిలవబడుతున్న ఒక పురాతన గృహం. అనంతరం దానిని కూల్చివేసి భవన నిర్మాణాలు చేశారు. భారత స్వాతంత్య్ర ఉద్యమంలో గాంధీజీ స్మృతులకు వేదిక ఇది. ఈ ఇంట్లో 1928–30 ప్రాంతంలో జాతీయ కాంగ్రెస్ కార్యాలయం ఉండేది. గాంధీజీ ఉద్యమ స్ఫూర్తికి ప్రభావితులైన స్థానిక నాయకులు, యువకులు ఉద్యమంలో పాలు పంచుకుని ఈ ఇంట్లోనే తరచూ సమావేశమయ్యేవారు. నాటి ఉద్యమంలో కీలక ప్రాత పోషించిన జోస్యుల రామచంద్రరావు, జోస్యుల లక్ష్మణరావు సోదరులకు చెందిన గృహం కావటంతో కాంగ్రెస్ కార్యకలాపాలన్నీ ఇక్కడే జరిగేవి. 1928 ఉప్పు సత్యాగ్రహంలో భాగంగా కాకినాడ మీదుగా రామచంద్రపురం వచ్చిన గాంధీజీ ఈ ఇంట్లో కాసేపు విశ్రాంతి తీసుకున్నారు.

బిక్కిన నివాసంలో బస

ఉమ్మడి మద్రాసు రాష్ట్ర ప్రభుత్వంలో వ్యవసాయశాఖ మంత్రిగా సేవలందించిన స్వాతంత్య్ర సమరయోధుడు, రామచంద్రపురం మండలం చోడవరానికి చెందిన బిక్కిన వెంకటరత్నం ఇంటిలో గాంధీజీ బస చేశారు. 1929 మే ఒకటిన రామచంద్రపురం వచ్చిన గాంధీజీ ఆ రోజు రాత్రి వెంకటరత్నం ఆతిథ్యాన్నీ స్వీకరించి అక్కడే బస చేశారు. ఇందుకు గుర్తుగా ఆ నివాసంలో శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.

గొల్లపాలెంలో గాంధీ సభ

కాజులూరు మండలం గొల్లపాలెంలో మహాత్మాగాంధీ సభ నిర్వహించిన ప్రాంతం 'గాంధీస్టేజీ'గా పిలవబడుతూ చారిత్రక ఆధారంగా నిలిచి ఉంది. గ్రామంలో 1939లో అడదాకుల సుబ్బారావు అనే స్వాతంత్ర సమరయోధుడి కోరిక మేరకూ ఉప్పు సత్యాగ్రహంలో భాగంగా జిల్లాకు వచ్చిన గాంధీజీ గొల్లపాలెం వచ్చారు. అక్కడే బహిరంగ సభ నిర్వహించారు.

దేశ బాంధవి 'దువ్వూరి సుబ్బమ్మ'

దేశ స్వాతంత్య్ర ఉద్యమంలో పాల్గొని జైలుకు వెళ్లిన మొట్టమొదటి తెలుగు మహిళగా దువ్వూరి సుబ్బమ్మ చరిత్రలో నిలిచిపోయారు. ఆమె రామచంద్రపురం మండలం ద్రాక్షారామలో 1880 లో మధ్య తరగతి వైదిక బ్రాహ్మణ కుటుంబంలో మల్లాది సుబ్బావధాని దంపతులకు జన్మించారు. ఆమెకు బాల్యంలోనే రాజమహేంద్రవరానికి చెందిన దువ్వూరి వెంకయ్యతో బాల్య వివాహం కావడం చిన్నతనంలోనే భర్తను కోల్పోయి వితంతువుగా మారారు. చదువులేని సుబ్బమ్మ స్వాతంత్య్రోద్యమం వైపు అడుగులు వేసింది. కాకినాడలో జరిగిన రాజకీయ సమావేశంలో పాల్గొని సంపూర్ణ స్వాతంత్య్రాన్ని బలపరుస్తూ అనర్గళంగా మాట్లాడింది. ఆమె కంఠం చాలా గంభీరంగా ఉండి మైకులు లేకపోయినా చాలా దూరం వినిపించేదట. దీంతో ఆమె పాడిన పాటలు బ్రిటిష్ వారికి వినిపించకుండా ఉండేందుకు డప్పులు, డబ్బాలు వాయించేవారట. 1922లో ఆమె సహాయ నిరాకరణ ఉద్యమంలో ప్రముఖ పాత్ర పోషించింది. అంతే కాకుండా ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమాల్లో పాల్గొంది. ఒకానొక సమయంలో ఆమెను బ్రిటీషు వారు నిర్బంధించి క్షమాపణ చెబితే విడిచి పెడతామని చెప్పినప్పుడు ఆమె 'నా కాలి గోరు కూడా అలా చేయదు' అని నిస్సంకోచంగా చెప్పిన ధైర్యవంతురాలుగా నిలిచింది. సుబ్బమ్మ 16 సంవత్సరాల పాటు ఏఐసీసీ సభ్యురాలిగా పనిచేసింది. కాకినాడలో 1923లో జరిగిన కాంగ్రెస్ సభలో ఆమెకు 'దేశ బాంధవి' అనే గౌరవం ఇచ్చారు.

వేడుకలకు సర్వం సిద్ధం

- నేడు 73వ స్వాతంత్య్ర దినోత్సవ పర్వదినం
- విద్యార్థులకు పలు రకాల పోటీల నిర్వహణ


కాజులూరు జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు


రాయవరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో జెండా అలంకరణలో విద్యార్థులు


అమ్మకానికి సిద్ధంగా వివిధ రూపాల్లో జాతీయ జెండా ఆకృతులు


విద్యార్థులకు నిర్వహిస్తున్న పరుగు పందెం పోటీలు

రాయవరం: స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. 73వ పంద్రాగస్టు పర్వదినాన్ని ఘనంగా నిర్వహించుకునేందుకు పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేటు విద్యా సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు సర్వం సిద్ధం చేసుకున్నాయి. ఉదయం ఎనిమిది గంటల నుంచి వేడుకలు ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులకు వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించారు. పోటీల్లో విజేతలైన వారికి స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలకు హాజరయ్యే అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేయనున్నారు. స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని మార్కెట్లో మువ్వన్నెల జెండాలు, అలంకార సామగ్రితో దుకాణాలు కళకళలాడాయి. కొన్ని దుకాణాలను పూర్తిగా జాతీయ జెండాలు ఇతర అలంకార సామగ్రితో నింపేశారు. పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, స్వచ్ఛంద సంస్థల్లో జాతీయ పతాకాలు ఎగుర వేసేందుకు ఆ సంస్థల ప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద జెండాలు, ఇతర మువ్వన్నెల అలంకార సామగ్రి కొనుగోలు చేసి అలంకరించే పనిలో నిమగ్నమయ్యారు. దీంతో మంగళవారం నుంచి దుకాణాలు సందడిగా మారాయి. దాదాపుగా 25 నుంచి 30 రకాల రూపాల్లో జాతీయ పతాకాల సామగ్రి అందుబాటులో ఉంచారు. కాటన్ (ఖాదీ) జెండాలు రూ.75–300 ధరకు లభిస్తున్నాయి. సిల్క్ జెండా రూ.50–150 లోపు లభిస్తున్నాయి. విద్యార్థులు షర్ట్‌కు ధరించేలా వివిధ రకాల ఆకృతుల్లో కూడిన జాతీయ జెండాల డిజైన్లు, టోపీలు, రిస్ట్, హెడ్ బ్యాండ్లు, టీషర్టులు, టోపీలు తదితర సామగ్రిని అమ్మకాలు చేస్తున్నారు.

ఆటల పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు

స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులకు మంగళ, బుధవారాల్లో ఆటల పోటీలు నిర్వహించారు. కబడ్డీ, ఖోఖో, పరుగు పందెం తదితర పోటీలు నిర్వహించారు. పోటీల్లో విజేతలకు గురువారం జరిగే స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేయనున్నారు.

కాజులూరులో..

కాజులూరు: కాజులూరు మండల గ్రామాల్లో బీజేపీ నాయకులు, కార్యకర్తలు బుధవారం 'ఘర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ప్రధాని మోదీ పిలుపు మేరకూ పాఠశాల చిన్నారులతో కలసి జాతీయ జెండాలతో గ్రామ వీధుల్లో ర్యాలీలు నిర్వహించి దేశభక్తిని పెంపొందించే విధంగా జాతీయ గీతాలు ఆలపించారు. దుగ్గుదుర్రులో ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ దూడల శంకరనారాయణ, కాజులూరులో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు సలాది వీరబాబు, కుయ్యేరులో పార్టీ యువమోర్చా అధ్యక్షుడు నిమ్మల రాజేష్ మంజేరులో మండల పార్టీ ప్రధాన కార్యదర్శి పుణ్యమంతుల శివాజీ తదితరుల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పోలిశెట్టి శ్రీనివాస్, పినిపే సతీష్‌చంద్ర, సలాది నానాజీ తదితరులు పాల్గొన్నారు.

వెల్లలో పొలంబడి


వెల్లలో ఎరువుల యాజమాన్యం గురించి రైతులకు వివరిస్తున్న ఏడీఏ రంగారావు

రామచంద్రపురం రూరల్: మండలంలోని వెల్ల గ్రామంలో బుధవారం మండల వ్యవసాయ అధికారి ఎస్.సత్యప్రసాద్ ఆధ్వర్యంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. రామచంద్రపురం వ్యవసాయ సహాయ సంచాలకుడు ఏఎస్‌వీ రంగారావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఎరువుల యాజమాన్యం గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఎరువులు వ్యవసాయ అధికారుల సూచన మేరకు తగిన మోతాదులోనే వాడుకోవాలని సూచించారు. ఎరువుల మోతాదు పెరిగితే చీడపీడల ఉధృతి పెరుగుతుందని వివరించారు. ఏఓ సత్యప్రసాద్ మాట్లాడుతూ కొత్తగా పొటాషియం సంబంధిత జీవన బ్యాక్టీరియా వచ్చిందన్నారు. పొటాషియం సంబంధిత పోషకం అందించడానికి సహాయపడుతుందని వివరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వీరబోయిన సూరిబాబు, ఎంపీటీసీ చిక్కాల స్వామి కాపు, వీఏఏ పి.సత్యనారాయణ, అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

16న మండపేటలో అన్న క్యాంటీన్ ప్రారంభం


అన్న క్యాంటీన్ మరమ్మతులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట: పట్టణంలోని ఏడిద రోడ్డులో ఈ నెల 16న అన్న క్యాంటీన్‌ను ప్రారంభించనున్నారని మున్సిపల్ కమిషనర్ టొద్దేపల్లి రాము తెలిపారు. నిరుపేదలు, అనాథల ఆకలి తీర్చేందుకు అన్న క్యాంటీన్‌ను తిరిగి ప్రారంభిస్తున్నారన్నారు. కాగా అన్న క్యాంటీన్ మరమ్మతు పనులను బుధవారం ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్ పరిశీలించారు. కార్యక్రమంలో టీటీపీ నాయకులు మల్లిపూడి గణేశ్వరరావు, శిరంగు ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

మండలంలోని అర్తమూరులో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు బుధవారం భూమిపూజ చేశారు. పంచాయతీ సర్పంచ్ గొలుగూరి అన్నపూర్ణ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వేగుళ్ల ముఖ్యఅతిథిగా పాల్గొని శంకుస్థాపనలు చేశారు. అంగన్‌వాడీ భవనం ఆధునీకరణ పనులకు, సత్య భాస్కర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రహరీ నిర్మాణ పనులకు ఆయన టెంకాయలు కొట్టి ప్రారంభించారు..అనంతరం సత్య భాస్కర పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కర్రి సత్యనారాయణ రెడ్డి (జంబయ్య), మండల మాజీ ఉపాధ్యక్షుడు గొలుగూరి విజయభాస్కరరెడ్డి, గ్రామ ప్రముఖులు పడాల సుబ్బారెడ్డి , నల్లమిల్లి వీర్రెడ్డి పాల్గొన్నారు.

ఎంపీపీ స్కూల్లో ముందస్తు స్వాతంత్య్ర వేడుకలు


ఆటపాటలతో అలరించిన విద్యార్థినులు

మండపేట: పట్టణంలోని 30వ వార్డు సంఘం కాలనీ మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం ముందస్తు స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు నిర్వహించారు. పాఠశాల ఆవరణలో ప్రధానోపాధ్యాయురాలు ముత్యాల మాణిక్యాంబ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో చిన్నారులు దేశ నాయకుల వేషధారణల్లో అలరించారు. ఆటపాటలతో అలరించారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు చిట్టూరి శ్రీధర్, వెంకట శ్రీధర్, సీతారత్నం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్‌ఎంసీ నూతన కమిటీకి సత్కారం


వైఎస్సార్ నాయకుల సత్కారం అందుకున్న కేశవరం ఎస్‌ఎంసీ కమిటీ

మండపేట: ఇటీవల నిర్వహించిన స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్‌ఎంసీ) ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ తరపున విజయం సాధించిన కేశవరం పాఠశాల నూతన కమిటీని బుధవారం ఆ పార్టీ నాయకులు ఘనంగా సత్కరించారు. సర్పంచ్ పెదపాటి సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి దూలం వెంకన్నబాబు, ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్, ఆపార్టీ నాయకులు వారిని ఘనంగా సత్కరించారు. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో జరిగిన సత్కార సభలో ఎస్‌ఎంసీ నూతన చైర్మన్ వైరాల రాజు, కో–ఆప్షన్ సభ్యులు అల్లంపల్లి కిశోర్, కొప్పిరెడ్డి ప్రసాద్, అద్దంకి రమణ, వైస్ చైర్మన్ కొల్లి సోని, సభ్యులు చుక్క దేవి, చెక్క ఏసమ్మ, కిన్నిరి రత్నకుమారి, దున్నే మునేష్ కుమార్, పెందుర్తి శ్రీదేవి, కడగల వరలక్ష్మిలను దుశ్శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పెదపాటి ఉమామహేశ్వరరావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు తుపాకుల ప్రసన్నకుమార్, పెదపాటి సీతారామ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కనకదుర్గమ్మ ఆలయ వార్షికోత్సవం


అన్న ప్రసాదాన్ని స్వీకరిస్తున్న భక్తులు

మండపేట: పట్టణంలోని కలువపువ్వు సెంటర్లో కొలువైన కనకదుర్గమ్మ వారి తొమ్మిదో వార్షికోత్సవం బుధవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు రెడ్డి బాబారావు కుటుంబ సభ్యులు, చుండ్రు వీరవెంకట్రావు చౌదరి, రెడ్డి పుల్లాజీ ఆధ్వర్యంలో ఈ వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని అయినవిల్లి కామేశ్వరరావు శర్మ పర్యవేక్షణలో ఆలయ ప్రధానార్చకుడు అయినవిల్లి రాజరాజేశ్వర రుద్రశర్మ వివిధ రకాల పూలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ఆలయం వద్ద దుర్గాహోమం, చండీహోమం, మూలమంత్ర హోమాలు జరిపారు. ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్‌లు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం టౌన్ హాలు వద్ద ఏర్పాటు చేసిన అన్నదానాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. చుట్టు పక్కల వీధుల్లో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అన్నప్రసాదాలను స్వీకరించారు. 3 వేల మందికి అన్నదానం చేసినట్టు రుద్రశర్మ తెలిపారు. కమిషనర్ బి రాము కూడా అమ్మవారిని దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో మల్లిపూడి గణేశ్వరరావు, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

18న నూతన కార్యవర్గం ఎంపిక


మీడియాతో మాట్లాడుతున్న కట్టా సూర్యనారాయణ తదితరులు

రామచంద్రపురం: నియోజకవర్గంలోని తాలూకా శెట్టిబలిజ సంఘానికి ఈనెల 18న నూతన కార్యవర్గ ఎన్నిక నిర్వహించనున్నట్లు సంఘ అధ్యక్షుడు కట్టా సూర్యనారాయణ, కార్యదర్శి వాసంశెట్టి లక్ష్మీనారాయణ బుధవారం స్థానిక విలేకరులకు తెలిపారు. ఈనెల 18న 2 గంటలకు స్థానిక శెట్టిబలిజ కల్యాణమండపం వద్ద తాలూకా శెట్టిబలిజ సంఘం సాధారణ సర్వ సభ్యుల సమావేశం నిర్వహించి అనంతరం నూతన కార్యవర్గం ఎన్నిక నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ ముఖ్యఅతిథిగా పాల్గొంటారన్నారు. నియోజకవర్గంలోని పట్టణ, మూడు మండల గ్రామాల శెట్టిబలిజ సంఘీయులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సంఘ ఉపాధ్యక్షుడు నరాల ఏడుకొండలు, సంఘ పెద్దలు ఇళ్ల సూర్యనారాయణ, శీలం గంగరాజు, పాలిక అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ తరగతులు


శిక్షణ సర్టిఫికెట్లతో సర్పంచ్‌లు, కార్యదర్శులు, ఎంపీపీ నాగమణి


రామచంద్రపురం ఎంపీపీ కార్యాలయంలో శిక్షణలో పాల్గొన్న సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు

రామచంద్రపురం రూరల్: మండలంలోని సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు ప్రభుత్వం నిర్వహించిన మూడు రోజుల రిఫ్రెషర్ శిక్షణ తరగతులు బుధవారంతో ముగిశాయి. చివరి రోజున ఎంపీపీ అంబటి భవాని అధ్యక్షతన రామచంద్రపురం ఎంపీపీ సమావేశ మందిరంలో మాస్టర్ ట్రైనర్స్ వలివేటి సూర్యసుబ్రహ్మణ్యం, పిల్లి త్రినాథ్, సుందర్‌లాల్, రాయుడు ఎంవీవీ నాగ ఈశ్వరరావు(మోహన్)లు వీధి దీపాల ఏర్పాటు, నిర్వహణ, ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్టం 1994 సెక్షన్ 80, 81, సీసీ చార్జీల చెల్లింపులు–ప్రభుత్వ విధానం, గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక–పరిశీలన అంశాలు, ఈ–గ్రామ స్వరాజ్ పోర్టల్, సంకల్ప శాఖల వారీ కేటాయింపులు, టైడ్–అన్ టైడ్ అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శిక్షణ అందించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్‌వీ రామచంద్రమూర్తి, ఈఓపీఆర్డీ ఎన్.షెలత్‌రాజు, పలు గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కె.గంగవరంలో...

కె.గంగవరం: గ్రామాభివృద్ధే లక్ష్యంగా ప్రతి సర్పంచ్ పరిపాలన అందించాలని ఎంపీపీ పంపన నాగమణి అన్నారు. మండల కేంద్రమైన కె.గంగవరంలోని స్త్రీ శక్తి భవనంలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ ముగింపు సందర్భంగా ఎంపీపీ నాగమణి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ మూడు రోజుల శిక్షణలో నేర్చుకున్న ప్రతి అంశాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామాల అభివృద్ధికి తోడ్పాటు అందించాలన్నారు. ఇప్పటికే అంతంత మాత్రంగా ఉన్న పంచాయతీ ఆదాయాలను పెంచే క్రమంలో అనుసరించాల్సిన అంశాలను పక్కాగా అమలు చేసి ప్రజలకు భారం కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. పంచాయతీ రాజ్ యాక్ట్‌ను సక్రమంగా అమలు చేసి ప్రజలకు మంచి పాలన అందించాలని కోరారు. వీధి లైట్లు, తాగునీరు, పారిశుధ్యం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని రైతులకు ఉపయోగపడే విధంగా పుంత రోడ్ల నిర్మాణాలు కూడా చేపట్టేలా మార్కెట్ యార్డులపై ఒత్తిడి తేవాలని కోరారు. అనంతరం సర్పంచులందరికీ ట్రైనింగ్ సర్టిఫికెట్లను ఎంపీడీఓ ఎస్.శ్రీనివాసరావు, తహసీల్దార్ కే.సూర్యారావులతో కలసి అందించారు. ఈవోపీఆర్డీ నరేంద్ర, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

జాతీయ స్థాయి కుంగ్‌ఫూలో విద్యార్థుల ప్రతిభ

ఆలమూరు: స్థానిక విద్యార్థులు జాతీయస్థాయి కుంగ్‌ఫూ, కరాటే పోటీల్లో చక్కని ప్రతిభను కనబర్చి అవార్డులను సాధించారు. ఇటీవల విజయవాడ పటమటలోని కార్పొరేషన్ ఇండోర్ స్టేడియంలో బుధవారం జాతీయ స్థాయి కుంగ్‌ఫూ, కరాటే పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో ఫైటింగ్ జూనియర్స్‌లో మన్విత్ నాయక్ (గోల్డ్ మెడల్) సబ్ జూనియర్ (ఏ) విభాగంలో జస్వంత్ నాయక్ (సిల్వర్ మెడల్), వైట్ బెల్ట్ ఫైటింగ్ (బి) విభాగంలో శ్రీకాంత్ నాయక్ (సిల్వర్ మెడల్) సాధించారు. అత్యంత ప్రతిభ కనబరిచిన ఈ విద్యార్థులంతా స్థానిక ఎస్సైగా విధులు నిర్వహిస్తూ బదిలీపై వెళ్లిన ఎస్సై శ్రీను నాయక్ కుమారులని గోల్డెన్ డ్రాగన్ చైనీస్ సీనియర్ మాస్టర్ నార్గాని చంద్రకుమార్ తెలిపారు.